ప్రజాశక్తి
బుధవారం 11 అక్టోబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

విద్యాశాఖలో

చిన్న ఉద్యోగులపై శీతకన్ను

ధర్నా చేస్తున్న విద్యాశాఖ కింది స్థాయి ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

- సకాలంలో విడుదలకాని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో వందలాది మంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వర్తించే చిన్న ఉద్యోగులపై ప్రభుత్వం చిరు కన్నేసింది. ఈ ఏడాది జూన్ నుంచీ జీతాల్లేకుండా వారిని పస్తులతో ఎండగట్టి ఎన్నో వినతులు, ఆందోళనల తర్వాత ఈ నెల 8న ఒక్క నెల మాత్రమే వేతనాన్ని అకౌంట్లలో జమ చేసి చేతులు దులుపుకుంది. విద్యాశాఖ, సర్వశిక్షాభియాన్ పరిధిలో విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో సుమారు 2500 మంది సర్కారు పనుల్లో నిమగ్నమైనా జీతాలకు మాత్రం వీరిని వెనక్కి పెట్టేస్తున్నారు. ఒక నెల ఆలస్యమైనా సర్దుకోవడానికి తమకేమీ రూ.వేలకు వేలు, లక్షలు జీతం రావడం లేదని వారంతా వాపోతున్నారు. మొత్తంగా చూస్తే జిల్లాలో ఎవ్వరికీ నెలనెలా జీతాలు సక్రమంగా పడడం లేదు. దీంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఎవరీ ఉద్యోగులు.. వీరు చేసే పనులేమిటి?

సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) పరిధిలోగల మండల రిసోర్స్ పర్సన్స్ సెంటర్లలో పనిచేసే వారికైతే అసలే అరకొర జీతం. ఆపై చాకిరీ అంతకు అంత ఉంటోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక వారిపై విధుల భారం మరింతగా పెంచేసింది. ఎంఆర్‌సిలలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, మెసెంజర్, సిఆర్‌పిలు అత్యధిక మంది విధుల్లో నిరంతరం ఉంటారు. విద్యాశాఖకు సంబంధించిన సమాచారమంతా వీరి ద్వారానే మండలాలు, జిల్లాలు, ఆయా గ్రామాల్లోగల ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తోంది. జెవికె, మధ్యాహ్న భోజన పథకం (ఎండిఎం), టెక్స్ట్‌బుక్స్ పంపిణీ, ఆన్‌లైన్, బయోమెట్రిక్ పనులు, ప్రైవేట్ స్కూళ్ల పిల్లలు నమోదు, టీచర్ల సంఖ్య వగైరా ఇవన్నీ ఎంఆర్‌సిల ద్వారానే వెళ్తోంది. ముఖ్యంగా జిల్లా మిగతా 2లో..

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్

నిధులు పుష్కలం..

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్
- సామూహిక గృహ ప్రవేశాల నేపథ్యంలో లేఅవుట్ల సందర్శన

ప్రజాశక్తి - ఆనందపురం, ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు పుష్కలంగా ఉన్నాయని, బిల్లుల చెల్లింపునకు ఎలాంటి ఇబ్బందీ లేదని, జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అధికారులను, వివిధ కాంట్రాక్టు ఎజెన్సీల నిర్వాహకులను ఆదేశించారు. ఈ నెల 12న సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నేపథ్యంలో ఆయన మంగళవారం జిల్లాలో పర్యటించారు. ఈ క్రమంలో ముందుగా ఆనందపురం మండల పరిధిలోని గిడిజాల, తంగుడిబిల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను సందర్శించారు. అనంతరం విశాఖ నగరంలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావులతో కలిసి ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి మిగతా 2లో..

ఆర్‌టిసి ఆదాయం పెంచడమే లక్ష్యం

వార్త 7లో..

ఎసిబి వలలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్

వార్త 7లో..

కూర్మన్నపాలెంలో స్థల వివాదం

వార్త 2లో..

భారత నౌకాదళాధిపతికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భారత నౌకాదళాధిపతి (చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్) అడ్మిరల్ ఆర్.హరికుమార్ మూడు రోజుల పాటు తూర్పు నౌకాదళ పర్యటనకుగానూ మంగళవారం సాయంత్రం విశాఖకు విచ్చేశారు. ఆయనకు తూర్పు నౌకాదళధిపతి రాజేష్ పెందార్కర్ సహా నావికాదళం ఘనంగా స్వాగతం పలికింది. అడ్మిరల్ హరికుమార్ సహా సతీమణి నేవల్ వెల్ఫేర్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు కళాహరికుమారి పర్యటనకు విచ్చేశారు. తూర్పునౌకాదళంలో జరుగుతున్న ఆపరేషనల్ ప్రాజెక్టులు, పనుల తీరును హరి కుమార్‌కు తూర్పునౌకాదళాధికారి పెందార్కర్ వివరించారు. అనంతరం హరికుమార్ నేవల్ కమాండర్ల సెకెండ్ ఎడిషన్ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. ఈ నేవీ కమాండర్ల అసెంబ్లీకి దేశంలోని కమాండర్లంతా హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో వంద మంది పాల్గొంటున్నారు. హరికుమార్ ఐఎన్ఎస్ కోరా 25వ వార్షికోత్సవ వేడుకల్లోనూ పాల్గొన్నారు. పలు నౌకలను సందర్శించారు.

ఐఎన్ఎస్ కోరా వార్షికోత్సవ వేడుకల్లో హరికుమార్

నేవల్ డాక్‌యార్డులో ఎమర్జెన్సీ డీజిల్ జనరేటర్ ప్రారంభం

నేవల్ డాక్‌యార్డులోని ఎమర్జెన్సీ డీజిల్ జనరేటర్ సౌకర్యాన్ని హరికుమార్ ప్రారంభించారు. ఇది 7.5 మెగావాట్ల అత్యవసర విద్యుత్ కెపాసిటీ కలిగినదని వివరించారు. నౌకలు, మిగతా 2లో..

ఉపాధిని దెబ్బతీస్తే ఊరుకోం

- ప్రభుత్వానికి విఒఎల హెచ్చరిక
- విశాఖ, అనకాపల్లిల్లో 36 గంటల నిరసన దీక్షలు ప్రారంభం

తమ ఉపాధిని దెబ్బతీసే కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో మంగళవారం నుంచి విఒఎలు 36 గంటల నిరసనలకు దిగారు. వేలాదిగా తరలివచ్చిన వీరు ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం మద్దతు తెలిపింది.

ప్రజాశక్తి - అనకాపల్లి, విశాఖ కలెక్టరేట్

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద విఒఎలు భారీ నిరసనకు దిగారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిగతా 2లో..

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విఒఎలు

సిపిఎం మద్దతు

కలెక్టరేట్ వద్ద విఒఎలు చేపట్టిన ఆందోళనకు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మద్దతు తెలిపి మాట్లాడారు. ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఒఎలదే కీలకపాత్రని తెలిపారు. అయినప్పటికీ వారికి కనీస వేతనాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలో అనేక మంది విఒఎలు మూడేళ్లుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

చిన్న ఉద్యోగులపై శీతకన్ను

విద్యాశాఖ కార్యాలయాల సమాచారాన్ని యూ-డైస్ వంటి విధుల్లో భాగంగా ప్రతి స్కూల్‌కీ వీరే అందిస్తారు.

వేధింపులు ఆపాలి

రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో జీతాలు పెంచి పిఆర్‌సి అమలు చేశారు. సర్వ శిక్షా అభియాన్‌లో మాత్రం జీతాలే సక్రమంగా ఇవ్వడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వేధించడం ప్రభుత్వానికి తగని పని. కేంద్రం ఆరు నెలలకోసారి బడ్జెట్ ఇస్తోంది, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కలిపి వీరి జీతాలకివ్వాలి. కానీ ఇవ్వడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2500 మంది ఎంఆర్‌సి సెంటర్లు, ప్రభుత్వ స్కూల్స్, కెజిబివిలో పనిచేసే వారున్నారు. అలాగే శ్రీకాకుళంలో రెండు వేల మంది, విజయనగరం జిల్లాలో 1050 మంది, మన్యం జిల్లాలో 800 మంది ఉన్నారు. వీరెవరికీ మూడు నెలలుగా జీతాల్లేవు. ఎలా బతుకుతారు. గతంలో జగన్ ఇచ్చిన హామీల్లో ఏవీ నెరవేరలేదు.

బి.కాంతారావు, ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశకాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో కృషి చేసి నిర్ణీత గడువులోగా శతశాతం నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన పని వివరాలు, సాధించిన ప్రగతిపై ఆరా తీశారు. డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసి తీరాల్సిందేనన్నారు. సంబంధిత లే-అవుట్లలో ఇళ్లను జియో ట్యాగింగ్ ద్వారా అనుసంధానించాలని, లబ్ధిదారులందరికీ బ్యాంకు ఖాతాలు తెరవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించి నిర్మాణాలను పూర్తి చేయించేందుకు కృషి చేయాలన్నారు. ఒక వేళ ఎవరైనా లబ్ధిదారులు ఆసక్తి కనబరచకపోతే ఇంటి పట్టాను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణాలకు సంబంధించి అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలనూ పూర్తి చేసి ఎప్పటికప్పుడు స్టేజ్ అప్‌డేషన్ చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్, వార్డు ఎమినిటీస్ సెక్రటరీకి బిఎల్‌ఒ బాధ్యతలు అప్పగించవద్దని చెప్పారు. ఆయా కాలనీల పరిధిలో బ్రిక్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన మెటీరియల్‌ను క్రమం తప్పకుండా సరఫరా చేయాలని, బిల్లుల చెల్లింపులో జాప్యం చేయొద్దని సూచించారు.

ఏజెన్సీ నిర్వాహకులు మరింత శ్రద్ధ వహించాలి

థర్డ్ ఆప్షన్‌లో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత ప్రగతి సాధించాలని, కాంట్రాక్టు ఏజెన్సీ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ఇళ్లను సంబంధిత లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు. ఒక వేళ ఏదైనా ఏజెన్సీ పనితీరు సరిగ్గా లేకపోతే ఒప్పందాన్ని రద్దు చేసుకొని మరొక ఏజెన్సీకి అవకాశం ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. ఇసుక తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏజెన్సీ నిర్వాహకులు కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకురాగా ప్రత్యేక కూపన్లు అందజేస్తామని బదులిచ్చారు. సమావేశంలో జివిఎంసి ఇఇ రవికృష్ణ రాజు, గృహ నిర్మాణ శాఖ ఇఇ, డిఇలు, ఎఇలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత నౌకాదళాధిపతికి ఘన స్వాగతం

సబ్‌మెరైన్లు, పారిశ్రామిక కేంద్రాలు ఏవైతే నేవల్ డాక్‌యార్డు పరిధిలో ఉన్నాయో క్లిష్ట సమయంలో విద్యుత్ సమస్యను అధిగమించడానికి ఇది తోడ్పడుతుందని వివరించారు.

నేడు సైలర్లు, డిఎస్‌సి జవాన్లతో ఇంటరాక్షన్

నేవీ చీఫ్ హరికుమార్ బుధవారం అధికారులు, సైలర్లు, డిఎస్‌సి జవాన్లతో ఇంటరాక్షన్ కానున్నారు. డిఫెన్స్ సివిలియన్ అకామడేషన్ బ్లాక్ (డిసిఎబి)ను ప్రారంభించనున్నారు.

వైసిపికి బొగ్గు శ్యామ్ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు నాయకుడు, పార్టీ మాజీ నగర కార్యదర్శి బొగ్గు శ్యామ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తన రాజీనామాను పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులకు పంపినట్టు మంగళవారం తెలిపారు. 2012 నుంచి వైసిపిలోనే ఉన్నానని, 2014, 2019 ఎన్నికల్లో, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానని చెప్పారు. కొన్ని కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని, త్వరలో తన అనుచరులతో చర్చించి రాజకీయ భవితవ్యంపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

ఎపి మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయ్ చందర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ మత్స్యకార వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విశాఖ నగరానికి చెందిన పేర్ల విజయ్ చందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. ఈ పదవిలో విజయ్ చందర్ రెండేళ్ల పాటు ఉంటారు. ఈ పదవిలో తొలిసారిగా నియమితులైన కోలా గురువులు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తన పదవికి రాజీనామా చేశారు. ఆనాటి నుంచి ఖాళీగా ఉన్న ఛైర్మన్ పదవిలో విజయ్ చందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు విజయ్ చందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధిని దెబ్బతీస్తే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి..)

ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడారు. ప్రభుత్వం విఒఎలకు సంబంధంలేని పనులు చేయిస్తూ తీవ్ర పని ఒత్తిడికి గురిచేయడం, లక్ష్యాలు విధించి అధికారులు వేధింపులకు దిగడం పరిపాటిగా మారిందన్నారు. గ్రామాల్లో కోళ్లు, మొక్కలు, విత్తనాల అమ్మకం, పాల వెలుగు పేరుతో అమూల్ డెయిరీకి పాలు పోయించేందుకు సంబంధించిన సర్వే పనులు అప్పగించడం తగదన్నారు. వివిధ రకాల లక్ష్యాలు ఇచ్చి తప్పనిసరిగా చేయాలంటూ పొమ్మనకుండా పొగపెట్టే చర్యలకు పూనుకుంటున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే మాడుగుల, సబ్బవరం, చోడవరంలలో మహిళా మార్టులను పెట్టి డ్వాక్రా సభ్యులందరూ అదే మార్టులలో అన్ని రకాల సరుకులూ కొనాలనే ఆదేశాలివ్వడం సరికాదన్నారు. విఒఎలకు రూ.లక్ష నుంచి రూ.50 వేలు మేర నెలకు బలవంతపు టార్గెట్స్ ఇచ్చి, అవి చేయకపోతే ఉద్యోగాలు మానేయాలనే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. జిల్లాలో అనేక మందికి మూడేళ్ల నుంచి వేతనాలు సరిగా అందడం లేదన్నారు. యాప్‌ల భారం మోపితే ఊరుకునేది లేదన్నారు. గ్రామ సమాఖ్యల విలీనం ఆపాలని, దీనివల్ల వేలాది మంది విఒఎలకు ఉపాధి పోతుందని, ఇది మానవ వనరులకు విఘాతం కలిగించడమే అవుతుందని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మాణిక్యం, ప్రజా సంఘాల నాయకులు డిడి.వరలక్ష్మి, సిహెచ్.శివాజీ, గనిశెట్టి సత్య నారాయణ, కె.సోమునాయుడు, డి.శ్రీనివాస్, విఒఎలు రాజేష్, రాము, మాణిక్యం, ఉమా, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు. ఆందోళనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు సంఘీభావం ప్రకటించారు.

విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 36 గంటలపాటు నిరసన దీక్ష చేపట్టారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు పి.అపర్ణ, కార్యదర్శి కె.కంచెమ్మ మాట్లాడారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మెర్జ్ ప్రక్రియ ఆపాలని, అన్ని రకాల బకాయిలూ చెల్లించాలని డిమాండ్ చేశారు. లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ఫోన్లను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. వాలంటీర్ ఐడితో విఒఎలతో పని చేయించరాదన్నారు. మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలను పొదుపు సంఘాల మహిళలతో బలవంతంగా కొనిపించే పద్ధతిని ఆపాలన్నారు. కార్యక్రమంలో యు.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో విఒఎల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న లోకనాథం

ముగిసిన మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ మానసిక వైద్యశాల, విశాఖ మానసిక వైద్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్‌కె.బీచ్‌లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఫ్లాష్ మాబ్, నాటకాల ద్వారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, వివక్ష నిర్మూలనపై సందేశాలిచ్చారు. అనంతరం ప్రభుత్వ మానసిక వైద్యశాలలో జరిగిన సభలో ఆంధ్ర వైద్య కళాశాల మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, విశాఖ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జి.సురేష్ కుమార్, ఎమిరేటస్ ప్రొఫెసర్ రెడ్డి, విశాఖ మానసిక వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ మాధవీలత, సిఐలు కె.రామారావు, ఎస్.విజయ కుమార్ ప్రసంగించారు. మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలైన పోస్ట్ గ్రాడ్యుయేట్, నర్సింగ్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పోస్టర్లు, నినాదాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక ఒత్తిడిని పోగొట్టుకోడానికి బెలూన్ యాక్టివిటీ, ర్యాలీతో పాటు వివిధ మానసిక పరీక్షలను స్టూడెంట్స్, ఫ్యాకల్టీకి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ రూపాసెల్వరాజ్, డాక్టర్ లక్ష్మీప్రభ, కెఎన్.గాయిత్రి, డాక్టర్ పికె.జయలక్ష్మి, సుజాత, ప్రమీల పాల్గొన్నారు.

పిఎం.పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీపాద శరచ్చంద్ర కీర్తి, ఉపాధ్యాయులు గరిమెళ్ళ నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో స్థల వివాదం

ఉక్కునగరం: కూర్మన్నపాలెం రెవిన్యూ సర్వే నెంబరు 39/1లో ఉన్న సుమారు రూ.10 కోట్లు విలువచేసే 1.9 ఎకరాల స్థలం విషయమై మళ్లీ అగ్గి రాజుకుంది. రౌడీ షీటర్లు ఈ స్థలంపైకి మంగళవారం వచ్చేశారు. కొంతకాలంగా రెండు గ్రూపులు ఈ స్థలాన్ని కాజేసేందుకు చూస్తున్నాయి. ఈ క్రమంలో గొడవలూ జరిగాయి. రాజకీయ పార్టీల పాత్రా దీనిలో ఉంది. మంగళవారం సుమారు 200 మంది రౌడీలు వచ్చి విధ్వంసం సృష్టించారు. సంఘటన స్థలంలో గందరగోళ వాతావరణం నెలకొనడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దువ్వాడ సిఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని అల్లరి మూకలను చెదరగొట్టారు. స్థలంలో దౌర్జన్యం చేసిన వారిని అరెస్టు చేసి దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్యే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కక్ష సాధింపులో భాగమే తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు అని పలువురు నాయకులు విమర్శించారు. పద్మశాలి సాధికార కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు వానపల్లి సత్య, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పప్పు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధారాలు చూపకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటే అది ముమ్మాటికీ కక్ష సాధింపేనన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, నాయకులు పాశర్ల ప్రసాద్, వానపల్లి గాయత్రి ఫణికుమారి, జోగ సన్యాసిరావు, గిడుతూరి సన్యాసిరావు, తమ్మిన విజయ కుమార్, పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఎయుటిడి ఆధ్వర్యాన నిరాశ్రయుల దినోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసితో కలిసి పది సంవత్సరాలుగా ఎయుటిడి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అందరికీ తెలియజెప్పాలని, నిరాశ్రయుల పట్ల అవగాహన, గౌరవం, బాధ్యతను పెంచాలని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నగర పోలీస్ శాఖ, జివిఎంసి, ఛారిటీ సంస్థలు, నిరాశ్రయులతో కలిసి ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసిపి కె.శ్రీనివాసరావు, కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గాజువాక
I.P. No. 09 / 2023

Between:
Sagi Jagadeeswari
... Petitioner
And:
Alamanda Lakshmi & 48 Others
... Respondents

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయుటం ఏమనగా నా క్లయింట్ శ్రీమతి సాగి జగదీశ్వరి కోర్టునందు దివాళా పిటీషన్ (IP) దాఖలు చేసియున్నారు. జనయెవ్వరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నయెడల **తేది: 20-11-2023 నాడు ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టునందు మీరు స్వయంగా గాని, లాయరుద్వారా గాని హాజరుకావలెను. లేనియెడల జనయెవ్వరికి ఎలాంటి ఆక్షేపణలేదని పరిగణించబడును.

వీరశ్రీను
M.A., MBA, LLB., PGDCM
న్యాయవాది, విశాఖపట్నం.
సెల్: 9440662358
8919489241

210 మంది రక్తదానం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ విద్యార్థి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని లయన్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ ఆర్గనైజేషన్, అనిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 210 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ డాక్టర్ గంటా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలోని బాలుర పరిశీలన కేంద్రాన్ని, వసతి గృహాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థులు అభిరుచి మేరకు విద్యతో పాటు వృత్తి విద్యా శిక్షణ ఇప్పించాలని సూచించారు. నూతనంగా నిర్మించిన బాలల పరిశీలన గృహాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా బాలలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సీసీ కెమెరాలు అన్నీ పూర్తి స్థాయిలో పనిచేయాలని, వాటిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బాలల న్యాయ మండలి సభ్యులు భాస్కరరావు, పర్యవేక్షణ అధికారులు రామ్మోహన్, వీరయ్య, మిషన్ వాత్సల్య సిబ్బంది అనూజ పాల్గొన్నారు.

9వ వార్డులో గడపగడపకు...

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్, చలపతినగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ఉమ్మిడి స్వాతిదాస్‌తో కలిసి తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, వైసిపి నాయకులు సత్యనారాయణ, మొల్లి అప్పారావు, జగ్గుపల్లి అప్పలరాజు, బొండా శ్రీనివాసరావు, చొక్కర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగరిక జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు వైసిపి నాయకులు సత్యాల సాగరిక జన్మదిన వేడుకలు మంగళవారం ఆరిలోవ కాలనీ, ఎస్ఆర్ నగర్‌లో నిర్వహించారు. తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆమెకు పుష్ప గుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ద్వారా పేద మహిళలకు చీరలు, ఆటో డ్రైవర్లకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కెల్ల సునీత, కోరుకొండ స్వాతీదాస్, నాయకులు కృపా జ్యోతి, బొండా శ్రీనివాసరావు, చొక్కర శేఖర్, పేర్ల విజయచందర్, అల్లంపల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో స్వర్ణ తులసీదళార్చన

ప్రజాశక్తి-సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకొని సింహాద్రి అప్పన్న ఆలయంలో స్వర్ణ తులసీదళార్చన కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉంచి స్వర్ణ తులసీదళాలను బేడా మండపం చుట్టూ ఊరేగించారు. సాయంత్రం గ్రామ తిరువీధి ఉత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహించారు.

ఎటిఎం మోడల్ వ్యవసాయంతో బహుళ పంటలు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రకృతి వ్యవసాయంలో ఎటిఎం (ఎని టైమ్ మనీ) మోడల్‌లో వ్యవసాయం చేపడితే బహుళ పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ తెలిపారు. మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 20 సెంట్లలో నాలుగు అడుగుల బెడ్స్ తయారుచేసి, ఘన, జీవామృతం వేసి బీట్రూట్, క్యారెట్, ముల్లంగి, మొక్కజొన్న, బెండ, చిక్కుడు, వంగ, టమోటో, మిరప పంటలు, ఆకు కూరలను బీజామృతంతో శుద్ధి చేసి పంటలు వేయాలని చెప్పారు. ఈ విధానంలో పలు పంటలు పండించడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుందని, రసాయన రహిత పంటల సాగు సాధ్యమని పేర్కొన్నారు. అంతరం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్‌రావు మాట్లాడుతూ, తర్లువాడ గ్రామంలో ఉన్న రైతులు అందరితో ఎటిఎం మోడల్‌లో సాగు చేయడానికి ప్రణాళిక తయారుచేసి గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తూ సాగు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్ డీడీఏ మల్లికార్జునరావు, రైతు శాస్త్రవేత్త, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ పరికరాల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యాపరమైన డిజిటల్ పరికరాల వినియోగంపై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ డైట్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. అవగాహన సదస్సును జిల్లా డిప్యూటీ విద్యా శాఖాధికారి ఎ.గౌరీశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన డిజిటల్ పరికరాలైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ స్మార్ట్ టివిలు, బైజూస్ ట్యాబ్‌లను సమగ్రంగా వినియోగించాలని సూచించారు. డిజిటల్ డివైస్ జిల్లా నోడల్ అధికారి సత్యమహేష్ మాట్లాడుతూ, డిజిటల్ పరికరాల వినియోగంలో సమస్యలు వస్తే పరిష్కరించే మార్గాలను వివరించారు. ప్రతి పరికరాన్నీ ఏయే కార్యక్రమాల కోసం ఏ విధంగా వినియోగించాలో పిపిటి ద్వారా అవగాహన కల్పించారు. డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్, ఎంఇఒ శివ రాణి, డైట్ అధ్యాపకులు సోమయాజులు పాల్గొన్నారు.

సాంకేతికతకు వర్క్‌షాపులు దోహదం

ప్రజాశక్తి- ఆనందపురం : ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అదిపుచ్చుకోవడానికి వర్క్ షాపులు ఎంతగానో దోహదపడతాయని టెక్ టీమ్ సొల్యూషన్స్ కంపెనీ శిక్షకుడు ఎన్.వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గిడిజాల సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన "పిసిబి.డిజైన్" అంశంపై ఏర్పాటుచేసిన రెండు రోజుల వర్క్ షాపు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో వెంకట్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగాలలో మరిన్ని మెలకువలు తెలుసుకోవడానికి వర్క్ షాపులు ఎంత గానో అవసరమన్నారు. ఆధునిక ఎలక్ట్రానిక్ బోర్డులు తయారీ, డిజైన్ రూపొందించడం వంటి అంశాలపై పిసిబి ట్రైనర్ వెంకట్, ఎమ్.జయశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

తోటగరువు హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జెడి

ఎఫ్ఎ 2 పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రాంతీయ విద్యా సంచాలకులు ఎం.జ్యోతికుమారి మంగళవారం సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎ -2 పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులను ఆమె అభినందించారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ అనూరాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ అగ్రశ్రేణి పరిశోధకులుగా ఎల్‌విపిఐఐ వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : స్టాన్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనంలో నేత్ర వైద్య విజ్ఞాన శాస్త్రంలో ప్రపంచంలో రెండు శాతం అగ్రశ్రేణి పరిశోధకులలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన 13 మంది వైద్యులను గుర్తించినట్లు ఎల్‌విపిఐఐ ఒక ప్రకటనలో తెలిపింది. డాక్టర్ గుళ్ళపల్లి ఎన్.రావు, ప్రొఫెసర్ డి బాలసుబ్రమణియన్, డాక్టర్ సావిత్రి శర్మ, ప్రొఫెసర్ జిల్ కీఫ్, డాక్టర్ ప్రశాంత్ గర్గ్, డాక్టర్ మహ్మద్ జావేద్ ఆలీ, డాక్టర్ అనిల్ కె మండల్, డాక్టర్ స్వాతి కలికి, డాక్టర్ రోహిత్ ఖన్నా, డాక్టర్ తారా ప్రసాద్ దాస్, డాక్టర్ సయన్‌బసు, డాక్టర్ రాజ నారాయణన్‌లను అగ్ర శ్రేణి పరిశోధకులుగా గుర్తించగా, అదనంగా పరిశోధనా విభాగంలో డైరెక్టర్ ఎమిరిటస్ డాక్టర్ శివాజీ సిసింతి మైక్రో బయాలజీ రంగంలో గుర్తించబడినట్లు పేర్కొన్నారు.

జనసేన మండల కమిటీ నియామకం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల జనసేన కమిటీని భీమిలి పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన వేములవలస పార్టీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులుగా తమ్మిన అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా తాడివాడ శివకృష్ణ, గాలగాని బాలు, జనరల్ సెక్రెటరీగా కోరుకొండ మూర్తి, కార్యదర్శులుగా బొద్దాపు గోవింద, డాక్టర్ పి.సన్యాసినాయుడు, బంగారునాయుడు, నర్సింగరావు, కల్యాణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జానకృష్ణ, మండల బూత్ కమిటీ కన్వీనర్లుగా ఆల్తిరాజు, మీసాల నాగేశ్వరరావు, ప్రశాంత్, కె.శంకర్రావు, రాంపల్లి సురేష్, కోరాడ శంకర్రావు నియమితులయ్యారు. వారికి నియామకపత్రాలను సందీప్ పంచకర్ల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య, మజ్జి శ్రీను, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆనందపురం మండల కమిటీ సభ్యులతో సందీప్ పంచకర్ల

నేరాలు ఘోరాలు

పెద్దేరు కాలువలో మృతదేహం

ప్రజాశక్తి- మాడుగుల రూరల్ : మండలంలోని వీరవిల్లి అగ్రహారం వద్ద పెద్దేరు కాలువలో యువకుడి మృతదేహం కలకలం రేపింది. మంగళవారం ఉదయం వీరవిల్లి అగ్రహారంవాసులు పెద్దేరు నదిలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి ఆరా తీశారు. మండలంలోని గొట్టివాడ అగ్రహారానికి చెందిన చీపురుపల్లి నాగేష్(28)గా గుర్తించారు. మృతుడు నాగేష్ రజక కుటుంబానికి చెందిన వ్యక్తి కాగా, అతనికి ఫిట్స్ ఉందని, ప్రమాదవశాత్తు కాలువలో పడిపోవడంతో మృత్యువాత పడి ఉంటాడని బంధువులు తెలిపినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని బయలుపూడి గ్రామంలో 22 కిలలో గంజాయితో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు బయలుపూడి గ్రామం శివారున గుమ్మడి పోతురాజు పాకల దగ్గరకు వెళ్లి దాడులు చేయగా, బయలుపూడికి చెందిన గుమ్మడి పోతురాజు అలియాస్ చిన్నబాబు అనే వ్యక్తి, ఏలూరు జిల్లాకు చెందిన కసిం‌శెట్టి శ్రీనివాసరావుకు 22 కిలోల గంజాయిని అమ్ముతుండగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బయలుపూడిలో గంజాయి అక్రమరవాణాను అరికట్టేందుకు పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నిందితులను పట్టుకునేలా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 18మందిని అనుమానితులుగా గుర్తించి, వారిపై నిఘా పెట్టామని, అలాగే జాజిమొగ్గలు అచ్చంనాయుడు జాజిమొగ్గలు తాతబాబు అనే ఇద్దరిపై పీడీయాక్ట్ అమలుచేసి, నిందితులను ఏడాది జైలులో పెట్టామన్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా చేసిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

అప్పికొండలో బీచ్ రాళ్ల మధ్య ఇరుక్కుపోయిన మహిళ

ప్రజాశక్తి-ఉక్కునగరం : అప్పికొండ బీచ్‌లో దిగి రాళ్ళ మధ్యలో ఇరుక్కుపోయి 23 గంటలు నరకయాతన అనుభవించిన అమ్మాయిని అప్పికొండ యువకులు రక్షించారు. అనంతరం దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలించారు. దీనికి సంబంధించి ఎసిపి త్రినాథ్ కథనం ప్రకారం... మచిలీపట్నానికి చెందిన కావ్య, ఫణీంద్ర ప్రేమించుకొని ఈ నెల 2వ తేదీన విశాఖకు వచ్చారు. గోపాలపట్నంలోని లాడ్జీలో దిగారు. ఇక్కడి నుంచి ఒక రోజు అరకు వెళ్లారు. తరువాత అక్కడి నుంచి విశాఖ చేరుకున్నారు. సోమవారం అప్పికొండ సముద్రతీరానికి వెళ్లారు. అక్కడ కొండమీద దేవాలయంలో ఇద్దరు పెళ్లిచేసుకున్నారు. అనంతరం ఇద్దరు బీచ్‌లో దిగారు. బీచ్ రాళ్ళమధ్యలో అమ్మాయి కాళ్ళు ఇరుక్కుపోయాయి. అమ్మాయి కాళ్ళు ఎంతకీ రాకపోవడంతో ప్రియుడు ఫణీంద్ర అక్కడ నుంచి వెళ్లిపోయాడు. 23 గంటలు సముద్రంలోనే రాళ్ళమధ్య అమ్మాయి అలానే ఉండిపోయింది. సముద్ర తీరానికి పిక్‌నిక్‌కు వచ్చినవారు అమ్మాయిని గమనించి స్థానికులకు చెప్పారు. స్థానిక యువకులు వచ్చి ఆమెను కాపాడి పోలీసులకు సమాచారమిచ్చారు.

ఇప్పటికే అమ్మాయి కనిపించడంలేదని ఆమె తల్లిదండ్రులు మచిలీపట్నం బందరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తుచేపట్టారు. ప్రేమికులు విశాఖలో ఉన్నట్టు గుర్తించడంతో అక్కడి పోలీసులు, తల్లిదండ్రులు విశాఖ చేరుకున్నారు. కెజిహెచ్‌లో ఉన్న కావ్యను విచారించారు. ఫణీంద్ర గురించి విచారించారు. ఫణీంద్ర అప్పికొండ బీచ్ నుంచి ఎక్కడికి వెళ్ళాడని పోలీసులు విచారిస్తున్నారు. మొబైల్ రింగ్ అవుతున్నా లిఫ్ట్ చెయ్యడం లేదని, ట్రాకింగ్ ద్వారా తెలుసుకుంటామని ఎసిపి తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎస్.కోటలో ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో 2 స్వర్ణ పతకాలు సాధించిన జివిఎంసి హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి పి.అభిషేక్ ను జిల్లా డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకర్ అభినందిస్తూ బహుమతి ప్రదానం చేశారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎఫ్ఎ 2 పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.తిరుమల శ్రీదేవి, ఎంఇఒ శివ రాణి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 971వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరంలో డబ్ల్యుఆర్‌ఎం-1,2 కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి వారు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాల ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్ర, దేశ వ్యాప్త ఉద్యమాలకు ఇక్కడ కార్మికులతో పాటు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.డి.బాషా, మురళీ, తిరుపతిరాజు, ఐవి.అప్పారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ల వద్ద సిసి కెమెరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి అపార్ట్‌మెంట్ వద్దా సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయకుమార్ సూచించారు. ఈ మేరకు అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ రోడ్డు శివరాంరెడ్డి స్వీట్స్ పక్కన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించేందుకు అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌మాల్స్, పలు దుకాణాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రమీల, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విస్తరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి-సీతమ్మధార: నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా చేపట్టిన పలు కూడళ్ళు, రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెదవాల్తేరు ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి రోడ్డు, ఎఎస్ఆర్.కాలేజీ గ్రౌండ్ జంక్షన్, జగదాంబ జంక్షన్, అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్, న్యూకాలనీ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పెదవాల్తేరు పోలమాంబ గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి రోడ్డును పరిశీలించి, 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులతో పాటు సెంటర్ మీడియన్, గ్రీనరీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లను రోడ్డుకు పక్కగా గ్రీనరీ ప్రాంతంలోకి మార్చాలని ఆదేశించారు. నగరంలో రద్దీ దృష్ట్యా స్మార్ట్ సిటీ నిధులతో రోడ్డ విస్తరణ పనులతో పాటు కూడళ్ళ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, వేణుగోపాల్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, ఆర్‌జివి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధి స్టాంపును రద్దు చేయాలని

12, 13న న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-లీగల్ : ఇటీవల ఆంధ్రప్రదేశ్ న్యాయ సమాఖ్య మండలి కొత్తగా తీసుకొచ్చిన న్యాయవాదులకు సంక్షేమ నిధి స్టాంపు రూ.20ని వెంటనే రద్దుచేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ స్టాంపును రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12, 13 తేదీల్లో కోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ, బార్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు కనీస పరిజ్ఞానం లేకుండా, రాష్ట్రంలోని బార్ అసోసియేషన్ల అనుమతి లేకుండా ఈ స్టాంపును తీసుకురావడం శోచనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద న్యాయవాదుల సంఘంగా ఉన్న విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాష్ట్రంలోని ఇతర న్యాయవాదుల సంఘాలతో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షులు బండారు రామకృష్ణ, పూర్వ ఉపాధ్యక్షులు జెవివి రాఘవేంద్రరావు, సీనియర్ న్యాయవాదులు విద్యాశంకర్ ఖండిన్వాల, పలక శ్రీరామ్మూర్తి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బగాది తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో కఠిన కారాగార శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : తొమ్మిదేళ్ల బాలికను లైంగికంగా వేధించాడనే అభియోగం రుజువైనందున ఒక వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ చిన్నపిల్లలపై నేరాల విచారణ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎ.ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాల ప్రకారం... గాజువాక ప్రాంతం స్వతంత్ర నగర్‌కు చెందిన నిందితుడు షేక్ కాసిం (45) అదే ప్రాంతంలో ఉన్న బాలికను ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి లైంగికంగా వేధించాడని బాలిక తల్లి గాజువాక పోలీసులకు 2016 జులై 4న ఫిర్యాదుచేశారు. గాజువాక పోలీసులు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

అప్పన్నను దర్శించుకున్న జియ్యాని శ్రీధర్

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలంలో వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీధర్ దంపతులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కెకె.లైన్ ద్వారా ఇనుప ఖనిజం సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఎండిసి నుంచి ఇనుప ఖనిజం సరఫరా కెకె.రైలు మార్గం ద్వారా పునరుద్ధరించారు. సెప్టెంబర్ 24వ తేదీన జైపూర్ కోరాపుట్ మధ్య కెకె.లైన్‌లో కొండ చర్యలు విరిగిపడటంతో స్టీల్‌ప్లాంట్‌కు ఖనిజ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మైన్స్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా ఇనుప ఖనిజం సరఫరా అప్పటికే తగ్గింది. ఇనుప ఖనిజం నిల్ల స్థాయి క్లిష్టమైన స్థాయికి చేరుకోవడంతో ప్లాంట్ కార్యకలాపాలకు సవాల్‌గా మారింది. దీంతో స్టీల్ ప్లాంట్ బృందం ఇనుప ఖనిజం సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటుచేసింది. ఎన్ఎండిసి కర్ణాటక బోలని బస్సు వన్, ఒడిశా మినరల్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ నుంచి ఐరన్ ఓర్ ఏర్పాటు చేయటంతో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు సాఫీగా నిరంతరాయం కొనసాగాయి. ఇదే సమయంలో కెకె. లైన్ పునరుద్ధరణకు పనిచేశారు దీంతో మంగళవారం నాటికి పనులు పూర్తయి కెకె.లైన్‌ను పునరుద్ధరించారు.

అద్దెకొచ్చే వారి వివరాలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పెందుర్తి : అపరిచిత వ్యక్తులకు ఇళ్లు అద్దెకిస్తే వారి వివరాలు సేకరించాలని సిఐ శ్రీనివాసరావు సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయి తదితర వ్యాపారాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తులు ఉన్న ఇంటిలో గంజాయి తదితరాలు దొరికితే ఆ ఇంటిని సీజ్ చేస్తామని చెప్పారు. ఇళ్లను అద్దెకిచ్చినప్పుడు వారి పూర్తి సమాచారం తెలుసుకొని ఇవ్వాలని చెప్పారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

కళా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పివి.రమణమూర్తి

ప్రజాశక్తి-సీతమ్మధార : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కాచి వడపోసిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కళా హస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి సూచించారు. కళా హాస్పిటల్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా కళా హాస్పిటల్ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అధిక సంఖ్యలో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళా హాస్పిటల్ అధినేతలు డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి, డాక్టర్ కళావతి మాట్లాడుతూ, వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు అధికంగా ఉండడంతో నగరంలో రక్త నిల్వల కొరత ఉందని తెలిపారు. దీంతో రోగులకు సమయానికి రక్తం అందడం లేదన్నారు. ఈ తరుణంలో యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళా హస్పిటల్ డాక్టర్స్ మిత్రబృందం, రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగ్లాం గేటు తెరిచేలా కృషి

ప్రజాశక్తి -గాజువాక : తుంగ్లాం గేటును ఉదయం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేలా కృషిచేస్తానని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు హామీ ఇచ్చారు. భెల్ గాజువాక యూనిట్ జిఎం జితేందర్‌రెడ్డితో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. కంపెనీ స్థితిగతులు, పురోగతి, తుంగ్లాం గేటు సమస్యపై చర్చించారు. సమావేశానంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తుంగ్లాం గ్రామస్తులు గేటు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, భూములిచ్చిన రైతులకు దారి ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. భెల్ ఆల్ ఇండియా చైర్మన్‌ను ఢిల్లీలో కలిసి తుంగ్లాం గేట్ తెరిచేలా కృషిచేస్తానని చెప్పారు.

తపాలా ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా మంళవారం స్థానికంగా తపాలా ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస ఉప తపాలా కార్యాలయం సబ్ పోస్ట్ మాస్టర్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో విశాఖ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ జి హరిబాబు, నార్త్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రభుదాస్, పిఎల్ఐ డిఒ రాజా పోతన్, ఎంఒ పి.అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ దోపిడీపై పెన్షనర్లకు అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బును తస్కరిస్తున్న నేపథ్యంలో సెల్ ఫోన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పెన్షనర్లకు మంగళవారం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో అవగాహన కల్పించారు. ముందుగా పెన్షనర్ల ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దీనబంధు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. హుస్సేన్, మల్కాపురం జోన్ కార్యదర్శి కె.నూకరాజు హాజరై ప్రసంగించారు. హయ్యర్ పెన్షన్, 2014కు ముందు రిటైర్డ్ అయిన సభ్యుల విషయాలను వివరించారు. అనంతరం సైబర్ దోపిడీ నేపథ్యంలో సెల్‌ఫోన్ వినియోగంపై మణిదీప్ అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు, బ్యాంకు ఖాతాలకు ఇతరులకు అర్థంకాని రీతిలో పాస్‌వర్డ్‌లను ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. ప్రమాద సమయంలో ఎమర్జెన్సీ కాల్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. సీనియర్ సిటిజన్ కార్డు అప్లికేషన్లు పూర్తి చేసి ఇస్తే కార్డులను తయారుచేసి ఇస్తానని తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్లు, పోర్టు పెన్షనర్లు తాతాజీ, మూర్తి తదితరులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

పంట పొలాలను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి -ఆనందపురం : ఖరీఫ్ పంట నమోదు తనిఖీలో భాగంగా గొట్టిపల్లి గ్రామంలోని వరి పొలాలను జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మంగళవారం సందర్శించారు. రైతులు వేసిన పంట వివరాలు, రకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, తహశీల్దారు లోకవరపు రామారావు, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.సంధ్య రత్న ప్రభ, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న జెసి విశ్వనాథన్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి, ఉక్కునగరం : జివిఎంసి 97వ వార్డు పరిధి ఎస్‌సి, బిసి కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు అని, ఆ దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 97 శాతం నెరవేర్చామని తెలిపారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. ప్రజలకే నేరుగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని తెలిపారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : జివిఎంసి 85వ వార్డులో రోడ్లు, కాలువలు, ప్రహరీల నిర్మాణాలకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్య, వైద్యం ప్రతి పేదవానికీ అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు చేపట్టారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైసిపి నాయకులు ఇల్లపు ప్రసాద్, బోరా సోమనాయుడు, చిన్న అప్పారావు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, ఇల్లపు కొండలరావు, దానబాల అప్పలనాయుడు, సాలాపు అచ్చిబాబు, నక్క రమణ బాబు, చీరదిబ్బి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారావు

ప్రజాశక్తి - యలమంచిలి

అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు సోమునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మండలంలోని పెంజెరువు ఆయకట్టు రైతుల్ని కలిసి వారి కష్టసుఖాలు మాట్లాడారు. ఒదిలేయలేక ఉడిచి ఉసూరుమంటున్నామని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. వరిలో కలుపు తీసే పెట్టుబడి మరింత భారమైందన్నారు. పాలు పోసుకొనే దశలో పంటకు నీరందించడం గగనమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడక్కడ కాలవల్లో, గుంటల్లో నిలిచిన నీరు ఇంజన్లు ద్వారా తోడుతున్నామన్నారు. రోజుకు రూ.200 పెట్టి డీజిల్ కొని పొలం బతికించుకుంటున్నట్లు నగిరెడ్డి శ్రీరామ్, ఇప్పటికే ఎకరాకు పెట్టుబడి తడిపిమోపెడైందని పిల్లా రమణమ్మ వాపోయినట్లు చెప్పారు. 250 ఎకరాల పెంజెరువు దిగువ ఆయకట్టు రైతులంతా పంటచేతికొచ్చే వాటం లేదంటూ దిగాలుపడుతున్నారని పేర్కొన్నారు. కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయంటున్నాయని, పెట్టిన పెట్టుబడిసొమ్ము అయినా ఎకరాకు రూ.30వేల చొప్పున ప్రభత్వం చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

రైతు సంఘం నేత అప్పారావుకు సమస్య చెబుతున్న మహిళ

ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం కుంచంగిలో విఎంఆర్డిఏ లేఅవుట్‌లో గత 18 రోజులుగా నిరసన తెలుపుతున్న 'ల్యాండ్ పూలింగ్ బాధిత రైతుల పోరాట దీక్షా శిబిరాన్ని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్రావు, జిల్లా కమిటీ బేరా జగదీశ్వరరావు, మరిసా సతీష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పేరుతో అనకాపల్లి జిల్లాలో 12 గ్రామాల్లో 1225 ఎకరాలు డి-పట్టా, కొండ పోరంబోకు భూములను సమీకరించి గిరిజన, దళిత, రైతు కూలీ, పేద ప్రజల పొట్ట కొట్టిందని విమర్శించారు. గత నాలుగేళ్లుగా జీవనోపాధిని దెబ్బతీసి తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని, కనీసం ప్రభుత్వం రైతులతో చేసుకున్న జీవో నెంబర్-72 ఒప్పందం ప్రకారం రైతులకు కేటాయించిన రెసిడెన్షియల్ ప్లాట్లను రిజిస్టర్ చేసి, డెవలప్ చేసి ఇవ్వడానికి కూడా కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల, అధికారుల మోసకారితనాన్ని ఎండగట్టి రైతాంగమంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, కొండబాబు, ఈశ్వరరావు కూండ్రం, కుంచంగి, రొంగలివాని పాలెం రైతులు పాల్గొన్నారు.

15 నుంచి కనకదుర్గమ్మ మహోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయదశమిని పురస్కరించుకొని ఈనెల 15 నుంచి 24 వరకు నవరాత్రి మహోత్సవాలు అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు నూకంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవరాత్రి మహోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, నైవేద్యాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మాలధారణ భక్తులకు మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. కర్రి సన్యాసినాయుడు కుమారుడు కర్రి రమేష్ జ్ఞాపకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పివి రమణ, కర్రి సన్యాసినాయుడు, కాండ్రేగుల నాయుడు, దాడి జైవీర్, కొణతాల శ్రీనివాసరావు, కొణతాల చంద్రశేఖరరావు, కెయం నాయుడు, పొలిమేర మణి, ఆళ్ల సూరిబాబు, నెల్లూరు సత్యనారాయణ, బుద్ధ భూలోక నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ విద్యార్థులకు ప్రధాని ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-కశింకోట : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తుత పరీక్ష విధానంపై ఇటీవల నిర్వహించిన చర్చ-2023లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు టివై నోహికా, ఎ.పణిత, వి శ్రీఅరుణతేజ ప్రతిభ కనబర్చి గెలుపొందారు. వీరికి ప్రధానమంత్రి అభినందనలు తెలుపుతూ ప్రశాంసా పత్రాలు పంపించారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాలలో మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంది, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు

ఏడాది వయస్సుకే అంతర్జాతీయ అవార్డులు

చిన్నారి లాస్వికఆర్యకు ప్రశంసల వెల్లువ

సాధించిన అవార్డులతో చిన్నారి లాస్వికఆర్య

ప్రజాశక్తి-అనకాపల్లి

పువ్వు పుట్టుకతోనే పరిమళిస్తుంది అనే నానుడిని రుజువు చేస్తోంది ఏడాది వయసు గల చిన్నారి లాస్విక ఆర్య. కేవలం 9 నెలలకే మూడు అంతర్జాతీయ ఒక జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించి పలు సంస్థలు అనేక అవార్డులను అందజేశాయి. అనకాపల్లి జిల్లా రేపాక గ్రామానికి చెందిన మంత్రి వెంకటనారాయణమూర్తి, తేజస్విని దంపతులకు గత ఏడాది అక్టోబర్ 11న లాస్విక ఆర్య జన్మించింది. ప్రపంచ బాలికల దినోత్సవం రోజునే జన్మించిన లాస్విక జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు గెలుచుకోవడాన్ని పలువురు హర్షిస్తున్నారు. ఆరు నెలల వయస్సులోనే పలువురు ప్రపంచ నాయకుల చిత్రాలను గుర్తించడం ద్వారా ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో రెండు అంతర్జాతీయ అవార్డులు గెలుచుకుంది. తొమ్మిది నెలల వయసులోనే ఒకటి నుంచి 20 స్వేర్సును గుర్తించడం, స్వాతంత్ర సమరయోధులను గుర్తించడం ద్వారా మెమరీ ఆఫ్ జనరల్ నాలెడ్జ్ విభాగంలో ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాధించింది. 2023 లిటిల్ ఛాంప్స్ ప్రశంస పత్రాలు, ట్రోఫీ, బ్యాడ్జి మెడల్ అందించారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఇండియన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2023 కేవలం 9 నెలల వయసులో నాలుగు నిమిషాల వ్యవధిలో 24 శరీర భాగాలను గుర్తించడంతో మాక్సిమం బాడీ పార్ట్స్ ఐడెంటిఫైడ్ బై యాన్ ఇన్ఫాంట్ ప్రశంస పత్రం, పురస్కారం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా చిన్నారి లాస్విక ఆర్యతో పాటు తల్లిదండ్రులు వెంకటనారాయణమూర్తి తేజస్విని దంపతులను పలువురు ప్రశంసిస్తున్నారు.

'ఎస్ఇజెడ్' కార్మికులకు బోనస్ చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఈజెడ్ ఫార్మా పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులందరికీ 20శాతం బోనస్ చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. మంగలవారం జరిగిన సమావేశంలో రాము మాట్లాడుతూ ఎస్ఈజెడ్, ఫార్మా పరిశ్రమలో కార్మికుల పరిస్థితి పేరు గొప్ప - ఊరుదిబ్బలా ఉందన్నారు. ఈ నెల జీతంతో కలిసి బోనస్ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు పరిశ్రమ యాజమాన్యాలు బోనస్ ప్రకటించలేదన్నారు. కార్మికుని జీతంలో ప్రతి నెల కొంత భాగాన్ని వేరుగా నిలవచేసి ఏడాదికోసారి బోనస్‌గా చెల్లిస్తారని గుర్తు చేశారు. కాంట్రాక్టు, పర్మినెంట్, హౌస్ కీపింగ్ అన్ని కేటగిరిలో కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్‌గా కాకపోయినా ఎక్స్‌గ్రేషియా, మరో పేరుతోనైనా చెల్లించాలని కోరారు. కార్మికులందరూ ఐక్యంగా బోనస్ సాధించుకోవాలన్నారు. మేనేజ్మెంట్ అనుసరిస్తున్న మోసపూరిత ప్రకటనలకు కార్మికులు మోసపోకూడదని సూచించారు. కార్మికులందరూ 20 శాతం బోనస్ సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కే.సోమునాయుడు, రాజు, చండి, సన్నబాబు, రైతు సంఘ నాయకులు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తు గడువు పెంచాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ద్వారా వివిధ రకాల కళా కారులకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరణ గడువు పెంచాలని జిల్లా సమాచారం శాఖ అధికారి ఇంద్రావతికి మంగళవారం దళిత సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. మంగళవారంతో గడువు ముగియనుండటంతో చాలామంది కళాకారులు ఆందోళన చెందుతున్నందున దరఖాస్తుల సమర్పణకు గడువును పెంచాలని ఏపీ దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల రాజ్యాధికార వేదిక రాష్ట్ర కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు కోరారు.

మొదటి మూడుస్థానాలు సాధించిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి. - పరవాడ : ఈ నెల 20 నుండి 24 వరకు కడపలో జరుగు ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాలలో రాష్ట్ర స్థాయి రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు మంగళవారం ఎంపికలు జరిగాయి. సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జిల్లా అర్చరీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా జట్టుకు 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ముందుగా ఈ పోటీలను పాఠశాల మరియు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్ పి. సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలువిద్య అన్న క్రీడా శరీరక, మానసిక సమన్వయానికి ప్రతీక అని, ఇటువంటి క్రీడలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపుతాయని తెలిపారు. సుమారు ఉమ్మడి విశాఖ నుండి 80 మంది ఈ ఎంపికలో పాల్గొన్నారు. ఎంపిక అయినా క్రీడాకారులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతలక్ష్మి, సీఈఓ కె. నిశంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కర్, కోచ్ సుధాకర్, ఎల్. సూరిబాబు, పాఠశాల కోచ్‌లు గోవింద్, హరిరాజ్ సింగ్, బషీర్, రాజేష్‌లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- దేవరాపల్లి : జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో మండలానికి చెందిన నలుగురు వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్లో ఆదివారం జరిగిన జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి చిన కన్నబాబు, నెక్కెళ్ళ దేముడు, బోను సత్యవతి, వేచలం గ్రామానికి చెందిన బడబల్ల సత్యం పలు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. వీరిలో రైతు నెక్కెళ్ళ దేముడు 70 ఏళ్లకు పైబడిన విభాగంలో ఐదు కిలోమీటర్ల నడక, షాట్ పుట్ 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఆదిరెడ్డి చిన కన్నబాబు 65 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలోమీటర్ల నడకలో ద్వితీయ స్థానం, షాట్ పుట్, 100 రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ హెచ్ఎం బోను సత్యవతి 60 ఏళ్ల పైబడిన విభాగంలో షార్ట్ పుట్, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ హెచ్ఎం బడబడల సత్యం 60 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలోమీటర్లు నడక, 100 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం, షార్టుట్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వీరిని రిటైర్డ్ ఉద్యోగులతో పాటు, గ్రామస్తులు అభినందించారు.

సంఘాల బలోపేతంపై శిక్షణ

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండల మహిళ సమాఖ్యలో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలాన సంస్థ (సెర్ప్) ద్వారా మహిళ రైతు ఉత్పత్తిదారుల లీడర్స్ రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ఎపిఓ ఎమ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం సభ్యులు అందరూ అభివద్ధి కావాలంటే లీడర్స్ తగిన సూచనలు పాటించాలన్నారు. లీడర్స్‌కి సభ్యుల బాధ్యతలు విధులు, పుస్తక నిర్వహణ, మంచి సంఘం లక్షణాలు, సంఘాల గ్రేడింగ్, పుస్తకాలు నిర్వహణ గూర్చి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు అనురాధ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల యోగా పోటీలను మండలంలోని రావాడ గ్రామ పంచాయతీలోని ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్లో మంగళవారం పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పిటిసి పిఎస్ రాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వర రావు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, అనకాపల్లి జిల్లా సచివాలయ యూనియన్ ప్రెసిడెంట్ వెంకట రమణ, పల్లా గోవింద్, స్కూల్ కమిటీ చైర్మన్ గొలగాని బాబురావు, తోట పవన్ కుమార్, మేడిశెట్టి అప్పలరాజు, షేక్ బాషా క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రాజు, తాతయ్యబాబు తదితరులు

అక్రమ కేసులకు భయపడేది లేదు

ప్రజాశక్తి- చోడవరం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెట్టించే అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే కెఎస్‌ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు అన్నారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లక్షల కోట్లు అవినీతి చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును అదే విధంగా చూస్తున్నాడని మండిపడ్డారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఆధారాలు లేకపోయినా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. కేవలం రాజకీయ కక్షతో అధికారం పోతుందని భయంతో జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి శ్రీనివాసరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, జి లక్ష్మీనారాయణ, దేవర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- సబ్బవరం : జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ రమేష్ కిషోర్ సూచన మేరకు స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానసిక ఆరోగ్యం అనేది సార్వత్రిక మానవ హక్కుగా నినాదించబడినది అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ కుమార్, వైస్ ప్రిన్సిపల్ జి.అప్పారావు, స్థానిక పోలీస్ స్టేషన్ సిఐ పి.రంగనాథం, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది జి.సాయి లక్ష్మి, ఎ.మధులత , పాఠశాల వైద్యాధికారి కె.కన్నంనాయుడు, స్థానిక పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

దిశ యాప్ మహిళలకు రక్షణ కవచం

ప్రజాశక్తి-చోడవరం : దిశా యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ అన్నారు. దిశా యాప్, యాంటీ ర్యాగింగ్ తదితర అంశాలపై మంగళవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశా యాప్ ద్వారా ప్రమాదంలో ఉన్న మహిళలు తమను తాము రక్షించుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మారుతున్న సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి కిరణ్ కుమార్, ఉమెన్ ఎంపవర్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మి మంగమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి మాల్యాద్రి, ఎస్ఎం రఫ్ఫుద్దీన్, లెక్చరర్లు జ్యోతి, సూర్యవతి, మహిళా కానిస్టేబుల్ శిరీష పాల్గొన్నారు.

దుర్గమ్మ, ముల్లారమ్మ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీలో ముల్లారమ్మ తల్లి, దుర్గాలమ్మ అమ్మవారుల నూతన ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. గ్రామానికి విచ్చేసిన సందర్భంగా వై.సి.పి నాయకులు , సచివాలయం కన్వీనర్ బొంది అచ్చిబాబు , బొంది మసేను స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సిఐసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వివిధ ముఖ్య నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాది ఎంపీపీ మెయిన్ స్కూల్‌కు మంజూరైన మధ్యాహ్న భోజన వంట సామాగ్రి (వంట పాత్రలు)ను వైస్ ఎంపీపీ దొండ నారాయణమూర్తి పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ శేషగిరిరావు మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ తమ పిల్లల విద్యాభివృద్ధికి ఇంటి వద్ద కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గత వారంలో జరిగిన ఎఫ్ఎ 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతి వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. పాఠశాలలో జరిగిన అభివృద్ధి గురించి తల్లిదండ్రులతో చర్చించారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

మందులు అందజేస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం ఎడ్ల వీధి సచివాలయం పరిధిలో జగనన్న రక్ష మెడికల్ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పి జయదేవ్, డాక్టర్ బండారు సత్యనారాయణ, ఏడువాక సత్యారావు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఈఓపిఆర్‌డి చైతన్య, ఈవో నారాయణరావు, ఒరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పార్లమెంటు సభ్యులు డాక్టర్ బి.వి.సత్యవతి సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్, ఎమ్‌పిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజని, ఇఒఆర్డీ యన్ రమేష్, వైద్యులు తిరుపతిరావు, యశోద పాల్గొన్నారు

అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి, మోసయ్యపేట, రామన్నపాలెం గ్రామాలకు చెందిన సురక్ష ఆరోగ్య సదస్సులు అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జెడ్పిటిసి లాలం రాంబాబు, జెడ్పి కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, వైసిపి నాయకుడు కోన బుజ్జి ,గ్రామ సర్పంచ్ పంచదార పైడిరాజు ,ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీను పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని దేవవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని .గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసిడిఎస్ పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, నరసింహమూర్తి, ఉప సర్పంచ్ అప్పల నరసింహరాజు,తహసీల్దార్ అంబేడ్కర్ ,ఎంపీడీవో శ్రీనివాసరావు,వైద్యాధికారి మురళి కష్ణారెడ్డి ,ఏవో సీతారామరాజు,హెచ్ఎం నూకరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శిరం నరసింహమూర్తి, సూరకాసుల గోవింద్, బాబూరావు, దండు బలరామరాజు పాల్గొన్నారు .

చీడికాడ : మండలంలోని దిబ్బపాలెం యుపి పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి కురచా జయమ్మ, ఎంపిడిఒ జయప్రకాశరావు ప్రారంభించారు. శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కామేశ్వరరావు సర్పంచ్ కోన అర్జున, ఎంపిటిసి దారపు పెద్దినాయుడు పంచాయతీ కార్యదర్శులు రమేషు, చంద్రశేఖర్, పిఎసిఎస్ అధ్యక్షులు సందారపు రమణబాబు. పాల్గొన్నారు

కొత్తకోట: రావికమతం మండలం కన్నంపేటలో కొత్తకోట పిహెచ్‌సి వైద్యబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యసురక్ష వైద్య శిబిరంలో 411 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వీర జ్యోతి, ఎంపిడిఒ వెంకన్న బాబు, తహసీల్దార్ మహేశ్వరరావు, గ్రామ సర్పంచ్ డి.సత్యవతి, వైద్యాధికారులు కెఎం సురేఖ, శ్రీనివాస్, మోహన్, సురేష్, ఎంపి హెచ్ఒ రామారావు, హెచ్ఇఒ విజయ పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కొమరవోలు గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, సర్పంచ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని సిహెచ్.నాగాపురంలో సర్పంచ్ యలమంచిలి రఘురామ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, కేడీపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు చంద్రనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, వైసిపి నాయకులు ఐతంశెట్టి గోపి, ఎపిడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి వైద్యులు తనిఖీలు చేసి మందులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్తం శెట్టి మహేష్, ప్రోగ్రాం ప్రత్యేక అధికారి పద్మ, ఎంపిడిఒ అడపా లవరాజు, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, పాండ్రంకి శ్రీను పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటమే..!

ఆరోగ్య సురక్ష శిబిరాలపై రోగుల పెదవివిరుపు

ప్రజాశక్తి- కోటవురట్ల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రచార ఆర్భాటాలకు పరిమితమౌతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పెషలిస్ట్‌వైద్యులు, ప్రత్యేక వైద్య, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉచితమందులంటూ ఎంతో ఆర్భాటంగా అధికారులు, అధికార పక్ష నేతలు ప్రచారం చేస్తున్నప్పటికీ, వాస్తవంగా క్షేత్రస్థాయిలో కనీసస్థాయిలోనైనా లేవని పలువురు అంటున్నారు. మంగళవారం పందూరు సచివాలయ పరిధిలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 300 మంది వరకు రోగులు వచ్చారు. ఏవేవో వైద్యపరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు, అయితే రోగులకు ఇచ్చేందుకు యాంటీబయోటిక్ మందులు లేకపోవడం విశేషం, వైద్య పరీక్షలకు వచ్చిన వారికి జగనన్న ఫోటోతో ఇచ్చిన సంచులు చూసి ప్రచారం చేసుకోవడానికే ఇదంతా అంటూ కొందరు రోగులు పెదవి విరుస్తున్నారు. కాగా సచివాలయ పరిధిలో రామచంద్రపురం, అల్లు ముయ్యపాలెం, గూడప లోవకు చెందిన గ్రామస్తులు వైద్య శిబిరానికి వచ్చేందుకు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీకాదు. ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది దాటలేని పరిస్థితుల్లో, పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి గొట్టువాడ మీదుగాఅవస్థలు పడుతూ వచ్చినా, శిబిరంలో అందిన వైద్యసేవలతో వారంతా తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, పలువురు వైద్యులు, ఎంపిహెచ్ఒ గోవిందరావు, గ్రామ కార్యదర్శి జ్యోత్స్న, విఆర్ఒ ఆశారత్నం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని పాత రోడ్డు-గుల్లేపల్లి రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు విస్తరణకు రూ.9.50 కోట్లు విఎంఆర్‌డిఎ నిధులు మంజూరైనట్లు చెప్పారు. నంగినారపాడు-దువ్వాడ రోడ్డు పనులు కూడా ఇదివరకే శంకుస్థాపన చేయడం జరిగిందని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, వైసీపీ నేతలు కోటన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, మోపాడ అప్పారావు, సబ్బవరపు నారాయణమూర్తి, సాలాపు వెంకటేశ్వరరావు, గొంప దేముడు, కర్రి బాబు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, బంటి కోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అమర్‌నాథ్ మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని కుంచంగిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ వెల్నెస్ సెంటర్ భవనాన్ని, వెంకుపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, మండల వ్యవసాయ అధికారి రంగాచారి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏటవతల గ్రామాలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-చోడవరం

ఏళ్ల గడుస్తున్నా చోడవరం మండలంలోని ఏటి అవతల గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్ప లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం చాకిపల్లి, రామజోగుపాలెం, కన్నంపాలెం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు శారదా నది దాటుటకు తాడు సహాయంతో వెళ్లవలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నో ఏళ్లగా వారికి బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చినా నేటికీ అది అమలు కాలేదని తెలిపారు. జనసేన అధికారం చేపట్టిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతాయని ఆయన రైతులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన నదిలోకి దిగి తాడు సాయంతో కొంత దూరం నడిచారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జి మూలు నాయుడు, అల్లం రామప్పారావు, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో ఎంఇఒల పాత్ర కీలకం

ప్రజాశక్తి-అనకాపల్లి :బాలల హక్కుల పరిరక్షణలో జిల్లాలోని మండల విద్యా శాఖాధికారులు పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో మంగళవారం బాలల హక్కుల పరిరక్షణలో మండల విద్యాశాఖాధికారుల పాత్రపై ఏపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యాన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఎంఇఒలు ఎంత మంది ఉన్నారు, ప్రభుత్వ, ప్రైవేటు,కార్పొరేటు పాఠశాలలు ఎన్ని, ప్రతి రోజు ఒక్కో ఎంఈఓ ఎన్ని పాఠశాలలు సందర్శిస్తున్నారు, ప్రభుత్వ సెలవులు పాటించని కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు, నూతన స్కూళ్ల అనుమతులు మంజూరు చేసేటపుడు బాలల హక్కుల పరిరక్షణలో ముడిపడి ఉన్న అంశాలపై ఎటు వంటి దృష్టి సారిస్తున్నారు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సెల్ ఫోన్లు వినియోగిస్తున్నారా, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు తెన్నులుపై విద్యార్థుల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారా, ఈ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల స్పందన ఎలా ఉంది, బడి బయట ఉన్న డ్రాపౌట్లుపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మి, జిల్లాలోని 24 మండలాల విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి : అక్టోబర్ నెలకు రేషన్ సరుకులు పంపిణీకి సాంకేతిక సమస్య తలెత్తడంతో పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఆఫ్‌లైన్‌లో రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా పౌరసరఫరా అధికారులతో పౌరసరఫరాల కమిషనర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఆఫ్‌లైన్ లోరేషన్ సరుకుల పంపిణీ చేయాలని సూచించారన్నారు. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఇంకనూ సరుకులు విడిపించని కార్డుదారుల వివరాలను ఎప్పుడు విడుదల చేస్తారన్న విషయం త్వరలో తెలియజేస్తామన్నారు. రేషన్ డీలర్ల లాగిన్‌ను ఎండియు ఆపరేటర్లు డౌన్‌లోడ్ చేసుకుని, ప్రతిరోజు విఆర్ఓ ప్రామాణికతతో రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, సాంకేతిక సమస్య పరిష్కారమైన వెంటనే తిరిగి ఆన్‌లైన్‌లోనే సరుకుల పంపిణీ ఉంటుందన్నారు.

వాణిజ్య సరళిలో పశువుల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొంతలం గ్రామంలో వాణిజ్య సరళిలో పశువుల పెంపకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పశువైద్యాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మానవులకు ఆవశ్యకమైన జంతు ప్రోటీన్ కొరత ఉందని, అది నివారించేందుకు పశువుల పెంపకాన్ని వాణిజ్య సరళిలో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వాణిజ్య సరళిలో గొర్రెలు, మేకలు, నాటు కోళ్ళు, సీమపందులు పెంపకానికి నిరుద్యోగ యువత, స్వయం సహాయక గ్రూపులకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో సహకారాన్ని అందిస్తుందన్నారు. ఔత్సాహికవంతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లోని వెటర్నరీ అసిస్టెంట్‌వద్ద వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుటకు ఎన్ఎల్ఎం వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.ు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంచార పశు వైద్య వాహన సేవలు, సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాస విత్తనాలు, రైతు భరోసా కేంద్రాలు వంటి సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 14 పశువులను పరీక్షించి ఉచిత వైద్య సహాయం అందజేశారు. 38 పశువులకు నట్టల నివారణ మందులు, నిరోధక టీకాలు అందజేశారు.కార్యక్రమంలో రైతులు, సిబ్బంది శివ, రాజు, నానాజీ, ప్రకృతి వ్యవసాయ నిపుణులు పాల్గొన్నారు.

చురుగ్గా ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని నక్కపల్లి , రాజయ్యపేట, జానకయ్యపేట, బోధిగల్లం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఎపిటిఎఫ్ సభ్యత్వ నమోదును ఈ యూనియన్ నేతలు మంగళవారం చురుగ్గా నిర్వహించారు.ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వేణు మాట్లాడుతూ చాలామంది ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు అందకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు .కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి వెంకటపతిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ బి. శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షులు కొండలరావు, ప్రధాన కార్యదర్శి సి హెచ్.అప్పలరాజు, గౌరవాధ్యక్షులు వై.కృష్ణ, నాగేశ్వరరావు, కె.రంగబాబు, అప్పారావు, బి.సింహాచలం, లక్ష్మణరావు, రవి, గణేష్, జగదీష్, సతీష్ పాల్గొన్నారు

ప్రధాన రహదారిపై పశు కళేబరం

ప్రజాశక్తి- గొలుగొండ :మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గ్రామ శివారులో ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన ప్రధాన రహదారిపై పశువుల కళేబరాన్ని వీధికుక్కలు పీక్కొని తింటూ మంగళ వారం దర్శనమిచ్చింది. విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుండడంతో అటుగావెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ముక్కు మూసుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు. మృతి చెందిన పశువును ఎవరో తీసుకువచ్చి డంపింగ్ యార్డ్ వద్ద పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఇంత నిర్లక్ష్యంగా పశుకళేబరాలను రోడ్డు పక్కన వేసేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకోని పంచాయతీ యంత్రాంగంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌టిసి ఆదాయం పెంచడమే లక్ష్యం

సంస్థ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

మొక్కలు నాటుతున్న ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆర్‌టిసి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం నర్సీపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. గ్యారేజ్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఆర్‌టిసి సిబ్బందితో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ విజయదశమికి 5500 స్పెషల్ బస్సులు నడుపుతామన్నారు. గతంలో టిక్కెట్ ధర కంటే అదనంగా 50శాతం వసూలు చేసేవారమని, దీంతో దసరా సీజన్‌లో ఆర్‌టిసికి మంచి ఆదాయం సమకూరేదన్నారు. కానీ ఇపుడు రానుపోను ఆర్‌టిసి టిక్కెట్ ఒకేసారి అడ్వాన్స్‌గా బుక్‌చేస్తే పది శాతం ఛార్జీలో రాయితీ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో కొత్తగా 1500 డీజిల్ బస్సులు,, వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులకుప్రతిపాదనలు పెట్టామని, అవి త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగస్తులు మాత్రం ప్రభుత్వంలో విలీనమయినప్పటికీ, బస్సులు మాత్రం సంస్థ ఆధీనంలోనే నడుపుతున్నామన్నారు. రవాణాశాఖకు ఆదాయం దృష్ట్యా సంస్థలోనే ఆర్‌టిసిని ఉంచడం శ్రేయస్కరమని భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో హయ్యర్ పెన్షన్‌ను రూ.నాలుగు వేలు మాత్రమే తీసుకునే ఉద్యోగులకు ఇపుడు రూ.30వేలు నుంచి రూ.40వేలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ప్రమాద బీమా రూ.40 లక్షలు ఉంటే ఇప్పుడు రూ.కోటి పది లక్షల చేసామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు అధికారులు ఎఎస్‌పి అధిరాజ్‌సింగ్ రాణా, ఆర్‌టిసి డిపో మేనేజరు ధీరజ్ ,అసిస్టెంట్ మేనేజర్ నాయుడు పాల్గొన్నారు.

కొత్తరేవుపోలవరం సచివాలయంలో

పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి

సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి- ఎస్ రాయవరం :మండలంలో కొత్త రేవుపోలవరం గ్రామ సచివాలయంలో పూర్తిస్థాయిలో అధికారులు లేక ప్రజలకు సేవలు అందడంలేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే సచివాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని భర్తీ చేయవలసిందిగా సిపిఎం నాయకులు కోరారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ 13 శాఖల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంలో కనీస శ్రద్ధ చూపలేదన్నారు. మండలంలోనే జనాభా ఎక్కువగా ఉన్న గ్రామ సచివాలయం కొత్త రేవుపోలవరం, అంతే కాకుండా మత్స్యకారులు ఎక్కువగా ఉన్న గ్రామ సచివాలయం కూడా ఇదే. ఇటువంటి పరిస్థితుల్లో ఇక్కడ ఫిషరీస్ డిపార్ట్మెంట్‌కు అధికారి లేకపోవడం, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా లేకపోవడం వలన ప్రజకు సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి, కొత్తరేవుపోలవరం గ్రామ సచివాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణలు వీరుతోపాటు సిపిఎం నాయకులు అప్పన్న, మాధవ పాల్గొన్నారు.

డాక్టర్లు లేక పశువైద్యసేవలు మృగ్యం

ఆసుపత్రి ముందు నిరసన చేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నియోజకవర్గంలో పశువైద్యం అందని ద్రాక్షలా మారిందని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. మంగళవారం నాతవరం వెటర్నరీ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ నాతవరంలో నూతనంగా వెటర్నరీ ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారని, అయితే డాక్టర్ లేకుండానే ఆసుపత్రిని ప్రారంభించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు. మండలంలో గునుపూడి, నాతవరం, శంగవరం గ్రామాల్లో మూడు వెటర్నరీ ఆసుపత్రులు ఉన్నా వైద్యులు నియమించలేని పరిస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని తీవ్రంగా విమర్శించారు. నర్సీపట్నం మండలం వేములపూడి వెటర్నరీ ఆసుపత్రికి డాక్టర్ లేరన్నారు. నియోజకవర్గంలో అనేక చోట్ల వెటర్నరీ ఆసుపత్రుల్లో ఇన్చార్జ్ డాక్టర్లతో కాలం వెల్లదీస్తున్నారని, దీంతో పాడి రైతులకు చెందిన పశువులకు అనారోగ్యం సంభవిస్తే సకాలంలో వైద్య సేవలు అందటం లేదని ఆరోపించారు. మాకవరపాలెం మండలం రాచపల్లి వెటర్నరీ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని వెటర్నరీ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాతవరం మండల అధ్యక్షులు వెలగ వెంకటరమణ, మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు గొంప ప్రసాద్, బద్రి, వెలగల నూకరాజు, రేగటి రాజు, చినరాజు, నాగేశ్వరరావు, జొన్న మహేష్, అంబటి లోవరాజు పాల్గొన్నారు.

ఎసిబి వలలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్

ఎసిబికి పట్టుబడిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్స్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మార్టిగేజ్ డీడ్ రిలీజ్ చేయడం కోసం ఒక వ్యక్తి నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటున్న క్రమంలో స్థానిక జగదాంబ జంక్షన్, సూపర్ బజార్ మార్కెట్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసులును, అతనికి సహకరించిన డాక్యుమెంట్ రైటర్ పి.వెంకటరావును, అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్ ఎస్.లక్ష్మిలను ఎసిబి అధికారులు మంగళవారం వలపన్ని పట్టుకున్నారు. వారిని ఎసిబి స్టేషన్‌కు తరలించారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ పరామర్శ

రామలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శంకరరావు

ప్రజాశక్తి -అనంతగిరి : పితృవియోగం పొందిన ఎస్‌టి కమిషన్ సభ్యురాలు కొర్రారామలక్ష్మిని మంగళవారం ఎస్‌టి కమిషన్ చైర్మన్. శంకరరావు పరామర్శించారు. రామలక్ష్మి స్వగ్రామం ఎస్‌కోట మండలం భర్తపురం గ్రామానికి వెళ్లి, ఆమెతోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకటేశ్వరరావు. ఎస్.కోట మాజీ ఎంపిపి అప్పారావు, సిరగం రాంబాబు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని వైద్య సిబ్బందికి హిమోగ్లోబిన్ యంత్రం వినియోగించడం, రక్త విశ్లేషణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు సిహెచ్ఓ బిజెవి .ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన టెక్నీషియన్ అనిల్ అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని సూచించారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన

కొత్తపల్లి జలపాతం వద్ద ఎఎస్‌పి ధిరాజ్

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని పాడేరు ఎఎస్‌పి ధిరాజ్ మంగళవారం సందర్శించారు అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ పర్యటక సీజన్ మొదలవుతున్న తరుణంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి అక్రమరవాణా, ఇతరత్రా చట్టవ్యతిరేక చర్యలపై నిఘాకు సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనుమానితులుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక సిఐ సత్యనారాయణ ఉన్నారు.

అట్టహాసంగా కళాశాల ఫ్రెషర్స్ డే

సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక శివపురంలోని మదర్ తెరీసా ఒకేషనల్ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్ డే వేడుకలను అట్టహాసంగా నిర్వహించార. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. జూనియర్ల డాన్సులు చూసి, ఆడిటోరియం మార్మోగేలా సీనియర్లు ఈలలు, కేకలు వేసి ఉత్సాహపరిచారు. ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాలేజీ వ్యవస్థాపకుడు ఎస్‌టి నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు స్నేహపూరితమైన వాతావరణంలో మెలగాలన్నారు. కళాశాలలో చదివే రోజులు మరుపురానివని, ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. . ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుత పోటీ పరీక్షల యుగంలో భవిష్యత్ బంగారుమయం కావాలంటే బాగా చదువుకోవాలని సూచించారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పశువైద్యశాల మరమ్మతుకు చర్యలు

వెటర్నరీ ఆసుపత్రిని పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- మాడుగుల రూరల్ : మండలంలోని ఎం కోడూరు గ్రామ పశువైద్యశాల మరమ్మతులకు మండల పరిషత్ నిధులు రూ. రెండు లక్షలను ఎంపిపి రామ ధర్మజ విడుదల చేసినట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు. మంగళవారం పనులను ప్రారంభించారు. మంజూరైన నిధులతో వైద్యశాల పైకప్పు, గచ్చులు, మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పర్యావేక్షణ అధికారి జమ్మల నాగేశ్వరరావు, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, కాంట్రాక్టర్ కర్రి వరహాలమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కె.నాయుడుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు తారురోడ్డును అనుకోని కొత్తగా విద్యుత్‌లైన్ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు రూ. కోటి మంజూరు చేయడంతో, ఈ పనులను ప్రారంభించామని వైసిపి నాయకులు రాజేశ్వరరావు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

◆ అమలాపురం వద్ద హఠాత్తుగా కూలిన కల్వర్టు

◆ భారీ వాహనం వెళ్లిన వెంటనే ఘటన ◆ రాకపోకలకు తీవ్ర అంతరాయం

కల్వర్టు వద్ద భారీగా కూలిపోయిన రోడ్డు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు నుండి అమలాపురం వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డు కూలిపోయింది. భారీ వాహనం వెళ్లిన వెంటనే ఈ ప్రమాదం జరగడం, ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం ఈ రహదారి గుండా ట్రాక్టర్లు ,ఆటోలు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి .మంగళవారం ఉదయం ఇసుక లారీ ఈ రహదారి గుండా వెళ్లడంతో అప్పటికే బీటల వారి ఉన్న రోడ్డు, లారీ వెళ్ళగానే కుప్పకూలిపోయింది. కొన్ని రోజులుగా కల్వర్టు వద్ద రోడ్డు బీటల వారి ప్రమాదభరితంగా ఉండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ముందస్తుగా కల్వర్టు వద్ద ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్లే రోడ్డు కూలిపోయిందని స్థానికులు అంటున్నారు.

రోడ్డు కుప్పకూలిన సమయంలో అక్కడ ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని, ఏదైనా జరిగి ఉంటే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం, అలసత్వం వీడాలని, కూలిపోయిన రోడ్డు వద్ద తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, వాహనరాకపోకలకు అవకాశంక ల్పించాలని కోరుతున్నాు. అలాగే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. కాగా . గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఆర్ అండ్ బి అధికారులు తీరిగ్గా వచ్చి, కూలిన రోడ్డును పరిశీలించారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులపై ఆరా

స్పందన సమస్యల పరిష్కారంపై ఆరా ప్రశ్నిస్తున్న ఆర్‌డిఓ జయరాం

ప్రజాశక్తి -కోటవురట్ల: జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై ఆర్‌డిఓ వెంకట జయరాం ఆరా తీశారు, మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న 143 ఫిర్యాదులపై తహశీల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు, అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో151 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని ప్రస్తుతం 81 గ్రామాల్లో జరుగుతున్నట్లు తెలిపారు.

మండలంలో పాములవాక, పీకొత్తపల్లి, ప్రస్తుతం రీ సర్వే జరుగుతుందన్నారు, డివిజన్ పరిధిలో జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పెండింగ్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటవేశారు. డివిజన పరిధిలో గుర్తించిన అసైన్డ్ భూముల వివరాలు కూడా సమగ్ర సమాచారం అందాల్సి ఉందన్నారు, మండలాల వారీగా జగనన్న చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇప్పటికే కోటవురట్ల, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, మండలాలలో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు దేవాలయాల భూముల జాబితాపై ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం

సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి నింపుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ప్రజాశక్తి -కొత్తకోట: అనాథలు, అభాగ్యులకు ఆపన్నహస్తం అందిస్తూ కొత్తకోటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్ పర్ పూర్ పీపుల్ సేవా సంఘం తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.. బిచ్చగాళ్లు, వృద్ధులు, అనాథలు, అన్నార్తుల ఆకలిని తీర్చడంతో పాటు పలు సేవలు అందిస్తూ పలువురి మన్ననలు పొందు తున్నారు . సేవా సంఘం సభ్యులు ఆధ్వర్యం మండల కేంద్రంలో రోడ్డు పక్కన మండలపరిషత్ కార్యాలయం సమీపంలో కొన్నాళ్ళుగా దిక్కులేకుండా పడిఉన్న అనాథను చేరదీని, అతనికి సపర్యలు చేసి, తీవ్ర గాయాలకు వైద్య సేవలు అందించి దుస్తులు మార్చారు. అతనికి ప్రతిరోజూ ఆహారం అందించే విధంగా సంఘం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. రోలుగుంట మండలం కొవ్వూరు, పెదబొడ్డేపల్లిలో ఉన్న వృద్ధాశ్రమాలలో పేదలకు ఆహారాన్ని అందిస్తూన్నారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు రహదారిలో బిచ్చగాళ్లకు, నిరుపేద వద్ధులకు నిత్యం ఆహారాన్ని అందిస్తున్నారు. అనాథగా మిగిలిపోయిన కొత్తకోట గ్రామానికి చెందిన ద్వారపు రెడ్డి నాయుడు (చిన్నబ్బాయి) అనే వ్యక్తిని, ఇంకా మరో మతిస్థిమితం లేనివికలాంగుడిని దత్తత తీసుకుని ప్రతిరోజు మధ్యాహ్న భోజనం అందజేస్తూన్నట్టు తెలిపారు. ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిదాయంగా, ఆదర్శంగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు, సంఘం అధ్యక్షులు విరోతి ఆనంద్, ఉపాధ్యక్షులు కొప్పు శ్రీనివాసరావు, కార్యదర్శి జవాది రాజా, సహాయ కార్య దర్శి గెంజి రాజ్‌కుమార్, గట్రెడ్డి నాగేశ్వరరావు, ట్రెజరర్ కోలా కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ వేములపూడి సత్తిబాబు, అమ్మిరెడ్డి గణేష్, బద్రి ఉన్నారు.

అనాథకు సపర్యలు చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సిసి రోడ్డుపై నిర్మించిన గోడ పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: దేవాదాయ శాఖ భూమిలో ఏర్పాటు చేసిన సిసి రోడ్డుపై అడ్డుగా నిర్మించిన గోడను ఇఒపిఆర్‌డి రఘురాం పరిశీలించారు. మండలంలోని 17 గ్రామాలకు మంచినీరు అందించేందుకు లింగంపేట మంచినీటి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డుపై అడ్డుగా గోడను నిర్మించారని స్థానిక టిడిపి నేతలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు స్థానిక కార్యదర్శి అప్పారావుతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు ఆలయ పూజారి గోల్కొండ త్రిమూర్తులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. నూకాంబిక ఆలయానికి వాస్తు దోషాలు తొలగించడానికి రోడ్డుపై గోడ కట్టడం జరిగిందని, తాగునీటికి పథకానికి వెళ్లడానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తక కొత్త రోడ్డును ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీంతో తక్షణమే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. రోడ్డులో నష్టపోయిన ప్రజాధనంపై దేవాదాయశాఖ బోర్డుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

భువనేశ్వరికి నక్కపల్లి నేతల సంఘీభావం

టిడిపి శ్రేణులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

ప్రజాశక్తి -నక్కపల్లి: చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని రాజమండ్రిలో మంగళవారం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి కలిసి సంఘీభావం తెలిపారు. చంద్రబాబుకమ అరెస్టు నిరసిస్తూ మండల, గ్రామస్థాయిలోనూ నిరసనలు, రిలే దీక్షలు చేపట్టినట్లు భువనేశ్వరి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. భువనేశ్వరిని కలిసి సంఘీభావం తెలిపిన వారిలో గుర్రం రామకృష్ణ ,ప్రగడ వీరబాబు, తోలేటి శ్రీనివాస్, వంగలపూడి శ్రీను, కొప్పిశెట్టి వాసు, మామిడి నూకరాజుఉన్నారు .

కొత్త పైపులైన్‌కు అనుమతులివ్వొద్దు

పంచాయతీ తీర్మానం చేయాలని మత్స్యకారుల వినతి

సర్పంచ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో కొత్త పైపులైను ఏర్పాటుకు పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వకుండా తీర్మానం చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. మంగళవారం రాజయ్యపేట పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పిక్కి అప్పలనరస, కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు .వార్డ్ మెంబర్ మైలపల్లి మహేష్ , పలువురు మత్స్యకారులు సర్పంచ్ , కార్యదర్శికు వినతిపత్రం అందజేశారు.

ఇప్పటికే హెటిరో పాత పైప్‌లైన్ వలన మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొత్త పైపులైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రెండేళ్లగా ధర్నా చేస్తున్నామనిమత్స్యకారులు గ్రామసభ దష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మత్స్యకారులు పిక్కి సత్తియ్య,పిక్కి గంగరాజు,చేపల సోమేష్, పిక్కి కాశి, కారే భూలోక పాల్గొన్నారు.